

పేదరిక నిర్మూలనే పి-4 సర్వే లక్ష్యం

విజయనగరం రింగురోడ్డు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనకు సంఘాల సాధికారిత కల్పించడం, మెరుగైన భవిష్యత్తును నిర్మించడమే పి-4 సర్వే ముఖ్య ఉద్దేశమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కార్యదర్శులు, ప్రత్యేక సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యంతో పి-4 కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు.

అడిగినంత ఇవ్వాల్సిందే!

● గజపతినగరం మండలానికి చెందిన ఓ బాలుడి పైనుంచి నాటు బండి వెళ్లిపోవడంతో తీవ్ర గాయాల య్యాయి. ఆ బాలుడిని అత్యవసర చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించాక కేజీహెచ్‌కు తీసుకువెళ్లాలని, ఇందుకోసం వెంటిలేటర్‌తో కూడిన లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ ఉండాలని వైద్యులు సూచించారు. నగరంలోని ఓ ప్రైవేట్ అంబులెన్స్‌తో మాట్లాడితే మొదట రూ.20 వేలు అడిగారు. అంతచెల్లించలేమని రూ.12 వేలు ఇవ్వగలమని తల్లిదండ్రులు ప్రాధేయపడటంతో రూ.13వేలకు ఒప్పుకున్నారు.

● విజయనగరంలోని కస్పా హైస్కూల్ ప్రాంతానికి చెందిన రమేష్ కొద్దిరోజుల కిందట కుటుంబ కలహాలకు విసిగి పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు రమేష్‌ను ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఖర్చు భరించలేక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తీసుకువెళ్లాలను కున్నారు. వెంటిలేటర్ ఉన్న అంబులెన్స్‌లో తరలించటానికి కిలోమీటరు రూ.5,500 వసూలు చేశారు. అత్యవసరం కావడంతో అడిగినంత ఇచ్చి రోగిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.



- విజయనగరంలో కొందరు అంబులెన్స్‌ల నిర్వాహకుల దందా!
- రోగుల నుంచి అధికంగా రవాణా చార్జీలు వసూళ్లు
- విశాఖ తరలించాలంటే రూ.15 వేలు ఇచ్చుకోవాలి
- నియంత్రణ లేకపోవడమే కారణం

విజయనగరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి):

విజయనగరంలో అంబులెన్స్‌ల దందా ఎక్కువైంది. కొవిడ్ సమయంలో కొన్నిరోజులు కట్టడి జరిగింది. ఇప్పుడు వ్యవహారం మొదటికి వచ్చింది. ఆస్పత్రుల మార్చురీలు, వార్డుల వద్దే అంబులెన్స్ నిర్వాహకులు కాచుకొని కూర్చుంటున్నారు. వారంతా ఒక్కటైపోయి రోగుల బంధువుల నుంచి అధికంగా వసూలు చేస్తున్నారు. అత్యవసరం కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతూనే రోగుల కుటుంబీకులు వారు అడిగినంత ఇచ్చేస్తున్నారు. ఎవరైనా చనిపోయినట్లు తెలిస్తే అందరూ అక్కడ వాలిపోతున్నారు. వారికి ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న స్వీపర్లు, సిబ్బంది సహకారం అందిస్తున్నారు. విజయనగరంలోని ప్రధాన ఆస్పత్రుల వద్ద పదుల సంఖ్యలో ప్రైవేటు అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయి. డ్రైవర్లు వరుస క్రమంలో వెళతారు. అంటే ఒక వాహనం కిరాయికి వెళ్లిన తరువాతే మరో వాహనం తీస్తారు. ఆ సమయంలో ముందున్న డ్రైవర్ ఎంత వసూలు చేసుకున్నా.. వెనుక ఉన్న డ్రైవర్ తగ్గిస్తామని చెప్పడు. అడిగినంత ఇవ్వాల్సిందే.

నియంత్రణ లేకపోవడం వల్లే..

ప్రభుత్వపరంగా నియంత్రణ లేకపోవడం వల్లే కొందరు అంబులెన్స్‌ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. యాక్సిడెంట్, పాముకాటు, సీరియస్ కేసులు అయితే డబ్బులు మరింత ఎక్కువగా వసూలు చేస్తున్నారని బాధితులు విమర్శిస్తున్నారు. అంతేకాకుండా అంబులెన్స్‌ల ఫిట్‌నెస్, డ్రైవర్ల లైసెన్స్, వాహనానికి అన్ని అనుమతులు ఉన్నాయా? అని కూడా తనిఖీలు చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.. ఈ అంశంపై రవాణశాఖ ఉప కమిషనర్ వద్ద ప్రస్తావించగా అంబులెన్స్‌ల ధరలకు సంబంధించి తమకు ఎలాంటి మార్గదర్శకాలు లేవని చెప్పారు. వాహనం ఫిట్‌నెస్ తదితర అంశాలు మాత్రమే పరిగణలోకి తీసుకుంటామన్నారు.

రిఫర్ చేస్తే కాసులే..

సాధారణంగా అత్యవసర, అనారోగ్య సమయంలో ముందుగా ప్రైవేటు ఆస్పత్రులకు తరలిస్తుంటారు. పరిస్థితిని బట్టి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించాలని సూచిస్తుంటారు. కేంద్రాస్పత్రిలో పరిస్థితి విషమిస్తే విశాఖలోని కేజీహెచ్‌తో పాటు ప్రైవేటు ఆస్పత్రులకు తరలించాలని రిఫర్ చేస్తారు. రోగుల అవసరాలను అదనుగా చేసుకుంటున్న అంబులెన్స్‌లు ఇష్టారాజ్యం గా చార్జీలు వసూలు చేస్తున్నారు. విజయనగరంలోని ఓ ఆస్పత్రి నుంచి మరో ఆస్పత్రికి తరలించాలంటే రూ.3 వేల నుంచి రూ.5 వేలు తీసుకుంటున్నారు. రోగి పరిస్థితి బట్టి వసూళ్లు పెరుగుతున్నాయి. ఆక్సిజన్, వెంటిలేటర్ అవసరమైతే ఇక బాదుడే.

● జిల్లా వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు సుమారు 30 వరకూ ఉన్నాయి. అందులో సగానికిపైగా విజయనగరంలోనే ఉన్నాయి. ఇవి పేరుకే పెద్దాస్పత్రులు. దాదాపు అత్యవసర కేసులు విశాఖకు రిఫర్ చేస్తుంటారు. విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ఘోషాస్పత్రి, మరో పది ఆస్పత్రులకు సమీపంలో ప్రతిరోజూ పదుల సంఖ్యలో అంబులెన్స్‌లు ఉంటాయి. పిలుపు కోసం డ్రైవర్లు వేచిచూస్తుంటారు. విజయనగరం-విశాఖ మధ్య దూరం 50 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. అయినా అత్యవసర వైద్యం కోసం రోగిని అంబులెన్స్‌లో తరలించాలంటే రూ.12 వేల నుంచి రూ.15 వేలు తీసుకుంటున్నారు.

ఆయకట్టు పెంపుతోనే 15 శాతం వృద్ధిరేటు

● కలెక్టరు అంబేడ్కర్



విజయనగరం కలెక్టరేట్ మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో జిల్లా 15 శాతం పైగా వృద్ధి రేటు సాధించేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టరు అంబేడ్కర్ తెలిపారు. తోటపల్లి కుడి ప్రధాన కాలువ, తారక తీర్థసాగర్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని త్వరలో జరిగే సదస్సులో ముఖ్యమంత్రిని కోరనున్నట్లు చెప్పారు. కలెక్టర్ల సదస్సు ఈనెల 25, 26 తేదీల్లో అమరావతిలో జరగనున్న నేపథ్యంలో 2025-26 జిల్లా అభివృద్ధి ప్రణాళికపై శుక్రవారం ఆయన సమీక్షించారు. కలెక్టరు మాట్లాడుతూ తోటపల్లి కుడి కాలువ, తారకతీర్థరామ సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా అదనంగా 50 వేల ఎకరాల ఆయకట్టు పెరుగుతుందన్నారు. తద్వారా వ్యవసాయ రంగంలో అదనపు ఉత్పత్తిని, ఆదాయాన్ని సాధించే అవకాశం ఉంటుంద న్నారు. దీంతోపాటు నగరానికి మంచినీటి సరఫరా, భోగాపురం ఎయిర్‌పోర్టుకు నీటి సరఫరా అవుతుందన్నారు. ఈ ప్రాజెక్టు త్వరగా పూర్తి చేయాల్సిన అవసరాన్ని సీఎంకు వివరిస్తామని చెప్పారు. సమావేశంలోని సీపీవో బాలాజీ, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

మానాపురం ఆర్‌వోబీ కాంట్రాక్టర్‌కు నోటీసులు..

మానాపురం ఆర్‌వోబీ నిర్మాణం ఆలస్యం అయినందున కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేయాలని కలెక్టరు అంబేడ్కర్ ఆదేశించారు. నోటీసు అందిన రెండు వారాల్లో వివరణ ఇవ్వాలని, లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. శుక్రవారం తన చాంబర్లో ఆర్ అండ్ బీ అధికారులతో సమావేశమై ఆర్‌వోబీ పనులపై సమీక్షించారు ఈ పనులు 2021 జూన్‌లో ప్రారంభం అయ్యాయని, ఒప్పందం ప్రకారం ఈ ఏడాది జనవరి 23కు పూర్తి చేయాల్సి ఉందని అన్నారు. ఇప్పటికే 780 రోజులు ఆలస్యమైందని, దీనివల్ల ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రజలకు ఇబ్బంది కలుగుతోందని అన్నారు. ఇప్పటివరకు 83.56 శాతం పనులు పూర్తయ్యాయని, 56.42 శాతం చెల్లింపులు జరిగాయని తెలిపారు. అగ్రిమెంట్ విలువ రూ.20.8 కోట్లు కాగా, రూ.17.268 కోట్ల పనులు జరిగాయన్నారు. మిగిలిన పనులు విలువ రూ.3.532 కోట్లు ఉందన్నారు.

రబీకి కష్టకాలం

● వంగర మండలం కొప్పర కొత్తవలసకు చెందిన తవిటనాయుడు తన పొలంలో మొక్కజొన్న సాగుచేసే వాడు. రబీ పంటగా వేసి మంచి ఆదాయం పొందేవాడు. కానీ గత రెండేళ్లలో సకాలంలో నీరందక, చీడపీడలు, తెగుళ్లు పెరిగి తీవ్రంగా నష్టపోయాడు. దీంతో రబీలో సాగు చేయకుండా ఉండడమే మేలన్న నిర్ణయానికి వచ్చాడు.

● రేగిడి మండలం శిర్లాం గ్రామానికి చెందిన అసిరి నాయుడు తన పొలంలో చెరకు సాగుచేసేవాడు. ఖరీఫ్‌లో వరితో పాటు రబీలో చెరకు వేసేవాడు. క్రమేపీ చెరకు సాగుతో నష్టాలు ప్రారంభమయ్యాయి. పెట్టుబడులు పెరిగాయి. మద్దతు ధర కూడా తగ్గింది. దీంతో రబీలో చెరకు సాగు మానేశాడు.

● రాజాం నియోజకవర్గం మడ్డువలస రిజర్వాయర్ పరిధిలో రబీ సీజన్ కింద రైతులు ఆరుతడి పంటలు అధికంగా వేసేవారు. కాలువ పరిధిలోని వంగర, రేగిడి, సంతకవిటి మండలాల్లో వేలాది ఎకరాల్లో పెసర, మినుము, వేరుశెనగ వంటివి పండేవి. కానీ రిజర్వాయర్ నీరు ఖరీఫ్‌నకే పరిమితం అవుతోంది. సంక్రాంతి తరువాత చుక్కనీరు రాని దుస్థితి. గతంలో వేల ఎకరాల్లో పండిన పంటలు ఇప్పుడు వందల ఎకరాలకు పడిపోయాయి.

- తగ్గుతున్న పంటల సాగు విస్తీర్ణం
- సాగునీటి కొరతే ప్రధాన కారణం
- గత ఐదేళ్లుగా ప్రాజెక్టులపై నిర్లక్ష్యం

రాజాం, మార్చి 21(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో రబీలో పంటల సాగు తగ్గుముఖం పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గతంలో ఖరీఫ్ కింద వరి పండించేవారు. రబీలో మొక్కజొన్న, వేరుశెనగ, చెరకు, నువ్వు, పెసర, మినుము, ఉలవలు వంటి ఆరుతడి పంటల సాగు ఉండేది. కానీ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగునీటి ప్రాజెక్టులపై అంతులేని నిర్లక్ష్యం కొనసాగింది. వర్షాకాలంలో మాత్రమే ప్రాజెక్టులకు నీరందే పరిస్థితి. మడ్డువలస, నారాయణపురం, తోటపల్లి ప్రాజెక్టుల వద్ద నీటి లభ్యత లేకుండా పోయింది. వర్షాకాల సమయంలో నీటినిల్వ చేసుకునే ప్రయత్నాలు జరగలేదు. ప్రాజెక్టులకు మరమ్మతులు లేకపోవడంతో నిల్వ చేసినా నీరు ఉండని పరిస్థితి. సంక్రాంతి తరువాత భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటాయి. దీంతో మోటార్లకు సైతం నీరు అందని దుస్థితి. ఈ కారణాలతో రబీ సాగంటేనే రైతు విముఖత చూపుతున్నారు.



తోటపల్లి కాలువ ద్వారా అందని సాగునీరు

వరితో పాటు ఇతర పంటలతోనే..

రైతులకు వరితో పాటు ఇతర పంటలు పండితేనే స్వాంతన చేకూరేది. జిల్లాలో మాత్రం ఆ పరిస్థితి లేదు. ఏడాదికేడాది రబీ సాగు తగ్గుముఖం పడుతోంది. రబీ సాగు (మిగతా 8వ పేజీలో..)



మొక్కజొన్న వేసిన రైతులు

కాలం చెల్లినవి.. నిషేధిత మందులు

- భారీగా స్వాధీనం చేసుకున్న అధికారులు
- జిల్లా వ్యాప్తంగా మెడికల్ షాపుల్లో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంటు ఎస్పీ ప్రసాద్



బొబ్బిలిలో మందుల షాపులను తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

విజయనగరం క్రైం/రింగురోడ్డు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని అంబటి సత్తర్వు వద్ద వెంకటరత్నం మెడికల్ స్టోర్సులో శుక్రవారం రాత్రి భారీగా కాలం చెల్లిన మందులు, నిషేధిత మత్తుటానిక్‌లను విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్సుమెంట్, డ్రగ్ కంట్రోల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరాంధ్ర విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్సుమెంటు ఎస్పీ బర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో ఇక్కడ తనిఖీ లు నిర్వహించారు. ఈ మెడికల్ షాపులో కొంతకాలంగా కాలం చెల్లిన ఔషధాలు, మత్తుకలిగించే టానిక్‌లు, లైసెన్సు లేని ప్రొటీన్ పౌడర్లు అమ్ముతున్నట్లు గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు. వీటిని స్వాధీనం చేసుకుని నిర్వాహకుడిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఆపరేషన్ గరుడలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించామన్నారు. వైద్యుల సిఫార్సు లేకుండా మత్తు కలిగించే టానిక్‌లు అమ్మరాదన్నారు. నిబంధలను అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో డ్రగ్ కంట్రోలర్ రజిత, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా..

విజయనగరం రింగురోడ్డు/బొబ్బిలి/రాజాం రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అధికారులు విజయనగరం, నెల్లిమర్ల, బొబ్బిలి, రాజాం తదితర ప్రాంతాల్లోని మెడికల్ షాపుల్లో దాడులు నిర్వహించారు. డ్రగ్ కంట్రోలర్ రజిత రికార్డులను, ఔషధాలను తనిఖీ చేశారు. రాజాంలో షాపులపై కేసులు నమోదు చేశారు. బొబ్బిలి తనిఖీల్లో విజిలెన్స్ సైబర్ క్రైమ్ సీఐలు సతీష్, బి.శ్రీనివాసరావు, డ్రగ్ఇన్‌స్పెక్టరు లావణ్య, ఈగల్ టీమ్ వెంకటేశ్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



6
క్రీడాకారుల కోట... కొండ వెలగాడ

అక్రమంగా తవ్వేస్తున్నారు



7

ఆ రోడ్డు విస్తరణకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయి. ఆవెంటనే ప్రభుత్వం మారిపోయింది. టీడీపీకి పేరొస్తుందని వైసీపీ రెండేళ్ల వరకు దాని గురించే పట్టించుకోలేదు. 2021 అక్టోబరులో రోడ్డు పనులు చేపట్టారు. తమ హయాంలో పూర్తిచేస్తామని ఆర్భాటాలు పోయారు. అయితే కాంట్రాక్టర్ రోడ్డు పనులు సగమే పూర్తిచేశారు. మిగతా సగం రోడ్డు తవ్వేసి అలా వదిలేశారు. దీంతో ఆరోడ్డంతా గుంతలమయమై పోయింది. దీంతో 32 గ్రామపంచాయతీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు మార్కింగ్ ఇచ్చి ఇళ్ల యజమానుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుత ప్రభుత్వమైనా ఈ రోడ్డును పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆ రోడ్డు.. అలా వదిలేశారు!



తవ్వి వదిలేసిన వేపాడ మండలం సోంపురం-ఆనందపురం రోడ్డు

- వైసీపీ ప్రభుత్వ హయాంలో అర్ధాంతరంగా ఆగిన పనులు
- విస్తరణ కోసం ఇళ్లకు మార్కింగ్ ఇచ్చి రోడ్డు తవ్వేసిన వైనం
- అక్కడక్కడా గుంతలమయం.. ప్రజల తీవ్ర ఇబ్బందులు
- స్థలం ఎంతపోతుందో తెలియక ఇళ్లు కట్టలేకపోతున్న ప్రజలు

శృంగవరపుకోట, మార్చి 21(ఆంధ్రజ్యోతి)

సోంపురం-అనందపురం రోడ్డు దాదాపు 16 కిలోమీటర్లు ఉంది. దీని విస్తరణకు రూ.39 కోట్లు అంచనా వ్యయంతో 2021 అక్టోబరు 20న గత వైసీపీ ప్రభుత్వం పను లు చేపట్టింది. వెడల్పు చేసేందుకు రోడ్డుకు అనుకుని ఉన్న గ్రామాల ఇళ్లకు మార్కింగ్ ఇచ్చారు. కొన్ని గ్రామాల్లో ఆ ప్రకారం యజమానులు ఖాళీ చేశారు. మరికొన్ని గ్రామాల్లో అధికారులే తొలగించారు. ఇంత వరకు బాగానే ఉంది. కాంట్రాక్టరు రోడ్డు నిర్మాణం సగమే పూర్తి చేశారు. మిగతా సగం తవ్వేసి వదిలేశారు. విస్తరణలో ఎంత స్థలం పోతుందో తెలియక ప్రజలు కొత్త నిర్మాణాలను చేపట్టలేకపోతు న్నారు. దీనికితోడు రోడ్డు గుంతలమయమై పోవడంతో ఆ రోడ్డులో ప్రయాణం చేసేందు కు ప్రజలు నాలుగేళ్లుగా నరకయాతన పడు తున్నారు. వైసీపీ ప్రభుత్వం తవ్వి వదిలేసిన ఈ రోడ్డును.. ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. అయినా ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ఈ రోడ్డులో ప్రయాణిస్తున్నా పట్టించుకోవడం లేదు.

ఈ మండలాల పరిధిలో రోడ్డు..

ఈ రోడ్డులో ఒక కిలోమీటరు లక్కవరపు కోట మండలం సోంపురం కూడలి పరిధి లోను, మరో కిలోమీటరు అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం అనందపురం కూడలి పరిధిలో ఉంటుంది. మిగిలిన రోడ్డంతా వేపాడ మండల పరిధిలో ఉంటాయి. ఈ రోడ్డుకు అనుకుని సోంపురం, అరిగిపాలెం, జగ్గయ్యపేట, సీతంపేట, వల్లంపూడి, వేపాడ, భర్తవానిపాలెం, చినగుడిపాల, నీలకంఠ రాజపురం గ్రామాలు ఉన్నాయి. ఈరోడ్డుకు కిలోమీటరు నుంచి (మిగతా 8వ పేజీలో..)

క్రీడాకారుల కోట.. కొండవెలగాడ


కొండవెలగాడ గ్రామం



- వెయిట్ లిఫ్టింగ్‌లో కఠోర సాధన
- జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పతకాల పంట
- క్రీడల కోటాలో ఉద్యోగాలు సొంతం

నెల్లిమర్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి)

కొండవెలగాడ... వెయిట్ లిఫ్టింగ్ క్రీడా వేదికలపై తరచూ విని పించే పేరు. పచ్చని కొండల దిగువన ఉండే ఈ గ్రామానికి వెళితే... వెయిట్ లిఫ్టింగ్‌లో కఠోర సాధన చేసే క్రీడాకారులు కనిపిస్తారు. ఇక్కడి బాలబాలికలు చిన్నప్పటి నుంచే బరువులు ఎత్తడంలో తర్ఫీదు పొందుతారు. వెయిట్ లిఫ్టింగ్‌లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహి స్తుంటారు. తగిన ఆహార నియమాలు పాటించేలా చూస్తారు. ఈ జాగ్రత్తలే ఇప్పుడు గ్రామ యువత క్రీడల్లో రాణించేందుకు తోడ్పడు తున్నాయి. గ్రామానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెస్తున్నాయి. వల్లూరి శ్రీనివాసరావు, మత్స సంతోషి, శనపతి పల్లవి, గురు నాయుడు, బెల్లాన హారిక, చుక్కా శ్రీలక్ష్మి, వల్లూరి అజయ్‌బాబు... ఇలా గ్రామానికి చెందిన సుమారు 40 మంది వెయిట్ లిఫ్టర్లు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడావేదికలపై సత్తా చాటుతున్నారు. వీరిలో చాలా మంది క్రీడాకారులు క్రీడా కోటాలో ఉద్యోగాలు సాధించారు. కోచ్ చల్లా రాము, బూసరి రవికుమార్ సలహాలతో నిత్యం కఠోర సాధన చేస్తూ లక్ష్యం వైపు అడుగులేస్తున్నారు.

ఒలింపిక్ పతకమే లక్ష్యంగా..

ఇటీవలే యూత్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో సత్తా చాటా డు శనపతి గురునాయుడు. గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌కు అవకాశం దక్కలేదు. గాయాల కారణంగా క్వాలిఫైయింగ్ ఈవెంట్స్‌కు వెళ్లలేకపోయాడు గురునాయుడు. 2028లో అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో జరిగే ఒలింపిక్స్‌కు కచ్చితంగా వెళ్లడమే తన లక్ష్యమని గురునాయుడు తెలిపాడు. ప్రస్తుతం భారత సైన్యంలో పారాచ్యూట్ రెజిమెంట్‌లో హవల్దారుగా ఉద్యోగం చేస్తూ... ఇండియన్ ఆర్మీ సర్వీసెస్-2 నుంచి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటుతున్నారు. 2030లో అహ్మదాబాద్ వేదికగా జరగనున్న సమ్మర్ యూత్ ఒలింపిక్స్ లక్ష్యంగా తర్ఫీదు పొందుతున్నాడు. ఒలింపిక్స్ చరిత్రలో తొలిసారిగా భారత్ 2036లో ఆతిథ్యం ఇస్తే కచ్చితంగా సొంతగడ్డపై పతకాన్ని సాధించడమే తనజీవితాశయమని చెబుతున్నాడు గురునాయుడు. 16 ఏళ్ల వయసులోనే మెక్సికోలోని లియోనోలో జరిగిన యూత్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో స్వర్ణం, వెండి పతకాలను సాధించాడు. అతని విజయాల జాబితాలో బంగారు పతకాలే 30కుపైగా ఉన్నాయంటే ఎంతగా శ్రమిస్తాడో అర్థం చేసుకోవచ్చు.

కామన్ వెల్త్ గేమ్స్‌లో మరో సంతోషం..

కొండవెలగాడకు చెందిన మత్స సంతోషి కూడా కామన్‌వెల్త్ గేమ్స్‌లో మెరిశారు. 2014 లో స్కాట్‌లాండ్‌లో జరిగిన గ్లాస్కో కామన్‌వెల్త్ క్రీడల్లో రజిత పతకాన్ని సొంతం చేసుకుంది. 2017లో ఆస్ట్రేలియా వేదికగా జరిగిన చాంపియన్‌షిప్ పోటీల్లో కూడా పతకాన్ని సాధించింది. అప్పట్లో ఆమెకు రాష్ట్ర ప్రభుత్వం రూ.7 లక్షల పారితోషికం ఇవ్వగా.... కేంద్ర ప్రభుత్వం రైల్వేలో సీనియర్ టికెట్ కలెక్టర్‌గా ఉద్యోగం ఇచ్చింది. అంతటితో ఆగిపోకుండా నిరంతర శిక్షణతో జాతీయ పోటీల్లో వరుసగా బంగారు పతకాలు సాధిస్తోంది సంతోషి.

'కామన్‌వెల్త్'లో వల్లూరి మెరుపు..

ఢిల్లీ వేదికగా 2010లో జరిగిన కామన్‌వెల్త్ గేమ్స్‌లో కొండవెలగాడ వెయిట్ లిఫ్టర్ వల్లూరి శ్రీనివాసరావు కాంస్య పతకం సాధించి... భారతదేశానికి పేరుతెచ్చాడు. అంతకుముందు 2003లో హైదరాబాద్‌లో జరిగిన ఏసియన్ గేమ్స్‌లో రజతం, 2009లో మలేషియాలో జరిగిన కామన్‌వెల్త్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్, 2011లో జంషెడ్‌పూర్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో మరో గోల్డ్‌మెడల్ సాధించాడు.. స్పోర్ట్స్ కోటాలో ఆర్మీలో పని చేసిన శ్రీనివాసరావు ప్రస్తుతం భువనేశ్వర్‌లో కోచ్‌గా పనిచేస్తున్నారు. ఆయన కుమారుడు వల్లూరి అజయ్‌బాబు కూడా వెయిల్ లిఫ్టింగ్‌లో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రాణిస్తూ పతకాలు సాధిస్తున్నాడు.

వీళ్లూ పతకాల వేటగాళ్లే..

- కేరళ రాష్ట్రంలోని తిరుచూర్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి ఖేలో ఇండియా ఉమెన్స్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో లావణ్య రెండు బంగారు పతకాలతోపాటు ఒక వెండి పతకాన్ని సాధించింది.
- అరుణాచల్‌ప్రదేశ్‌లోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీలో గత నెలలో జరిగిన ఐడబ్ల్యుఎల్ఎఫ్ జాతీయస్థాయి యూత్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో బి.రాజేశ్వరి కాంస్యం, దినేష్ స్వర్ణం, బెల్లాన భార్గవి వెండి, వల్లూరి సుస్మిత స్వర్ణం, పల్లవి కాంస్యం, రాము కాంస్యం, జనపాడి దేవిశ్రీ వెండి పతకాలు సాధించారు.
- తమిళనాడులో జరిగిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో విసి నిగిరి రాము స్వర్ణం, బెల్లాన హారిక రజత పతకాలను సాధించారు.
- హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో గత ఏడాది జరిగిన ఆలిండియా ఇంటర్ జోన్ ఉమెన్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో శనపతి పల్లవి స్వర్ణం, చుక్కా శ్రీలక్ష్మి వెండి, బి.రాజేశ్వరి కాంస్య పతకాలను సాధించారు.

పేదరికం అడ్డురాలేదు..



పేదరికాన్ని చూశాను. సాధించాలనుకుంటే అదేమీ అడ్డుగోడ కాదు. స్నేహితుల సాయంతో శిక్షణ తీసుకున్నాను. సౌకర్యాలు లేకపోయినా మొదటి ప్రయత్నంలోనే జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నాను. ఇప్పటి వరకు దక్షిణాఫ్రికా, థాయ్‌లాండ్, మలేషియా, సింగపూర్, చైనా దేశాల్లో ఆడాను. కామన్‌వెల్త్‌లో వచ్చిన కాంస్యంతో పాటు మొత్తం 16 అంతర్జాతీయ పతకాలు వచ్చాయి.

-మత్స సంతోషి, వెయిట్ లిఫ్టర్, కొండవెలగాడ

కఠోర శ్రమతోనే సాధ్యం..



వెయిట్ లిఫ్టింగ్‌లో రాణించాలంటే కఠోర శ్రమ అవసరం. శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలి. జాతీయ, అంత ర్జాతీయ వేదికలపై రాణించాలంటే సామన్య విషయ మేమీ కాదు. కోచ్‌ల సూచనలు పాటిస్తూ నిరంతర శిక్షణ తీసుకుం టున్నాం. అంతర్జాతీయ వేదికలపై సత్తాచాటాలనేదే లక్ష్యం.

-శనపతి పల్లవి, వెయిట్ లిఫ్టర్, కొండవెలగాడ

సౌకర్యాలు కల్పించాలి..



అంతర్జాతీ స్థాయిలో సత్తా చాటేందుకు అవసరమైన వన రులు ప్రస్తుతం అందుబాటులో లేవు. సరైన క్రీడా పరికరా లను, సౌకర్యాలను ప్రభుత్వం సమకూరిస్తే మరో నాలుగేళ్లలో ఒలింపిక్స్‌కు క్రీడాకారులను సిద్ధం చేయగలను. దాతల సహకారంతో జిమ్‌ను నెట్టుకొని వస్తున్నాం. పదుల సంఖ్యలో గ్రామంలో క్రీడాకారులు ఉన్నారు. అందరూ ప్రతిభగల వారే. అందరూ నిరుపేద కుటుంబాలకు చెందినవారే.

-చల్లా రాము, కోచ్, కొండవెలగాడ




బ్రిడ్జి కింద ఇరుక్కుపోయిన లారీ

మెంటాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జయతి గ్రామం వద్ద హరిత రహదారి బ్రిడ్జి కింద ఊకలారీ శుక్రవారం ఇరుక్కుపోయింది. ఇప్పలవలస రైస్ మిల్లు నుంచి గజపతినగరం వైపు ఊకను తరలిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో కూలీలను పిలిపించి ఊకను తొల గించి లారీని బయటకు తీశారు. రెండు గంటల పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. బ్రిడ్జి ఎత్తు తక్కువగా ఉండడం వల్ల బస్సుపైన లగేజీ వేసినా ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు.

పోలీసులకు సేవా పతకాలు

బెలగాం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఉత్త మ సేవలు అందించిన పోలీసులకు, ఫైర్ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం సేవా పతకాలను ప్రకటించింది. ఈ పతకాలకు జిల్లా నుంచి పలువురు ఎంపికయ్యారు. వారిలో ఏఆర్ ఎస్ఐ పి.శ్రీనివాసరావు ఉత్తమ సేవా పతకా నికి, ఏఎస్పీ ఒ.దిలీప్ కిరణ్, డీఎస్‌బీ ఎస్ఐ ఎస్.వెంకట రమణ రాజు, ఏఆర్ఎస్ఐ ఎ.చి న్నయ్య, పార్వతీపురం టౌన్ హెచ్‌సీ కె.కృష్ణ మూర్తి, పార్వతీపురం రూరల్ హెచ్‌సీ ఎం. చిన్నతిరుపతిలు సేవా పతకాలకు ఎంపిక య్యారు. అగ్నిమాపక శాఖలో జిల్లా నుంచి గుమ్మలక్ష్మీపురం ఫైర్ స్టేషన్‌కు చెందిన లీడింగ్ ఫైర్‌మేన్ డి.శ్రీరాములు, పార్వతీపు రం ఫైర్ స్టేషన్‌కు చెందిన డ్రైవర్, ఆపరేటర్ కె.మోహనరావులు సేవా పతకాలకు ఎంపిక య్యారు. వీరిలో జిల్లాలో ఏఎస్పీగా పనిచేసి న దిలీప్ కిరణ్ అమరావతి ఏసీబీకి బదిలీ పై వెళ్లారు. వచ్చే ఉగాదికి రాష్ట్ర ప్రభుత్వం ఈ పతకాలను ప్రదానం చేయనుంది.

వంకాయలు పండి పోయాయి!


పొలంలో పండిపోయిన వంకాయలు

గజపతినగరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎండనకా... వాననకా... కష్టపడి పంటలు పండించిన రైతులకు పెట్టుబడులు దక్కడం లేదు. దీంతో దిక్కు తోచని పరిస్థితిని ఎదుర్కొంటు న్నాడు. ఈ కోవలోనే ఓ రైతు గిట్టుబాటు ధర రాకపోవడంతో చేసేదిలేక పంటను పొలంలోనే వదిలే శాడు. వివరాల్లోకి వెళితే... మండలంలోని లింగాలవలస గ్రామానికి చెందిన సారిక అప్ప న్న అర ఎకరంలో వంకాయలు సాగు చేశాడు. సుమారు 5వేల వరకు ఖర్చు చేశాడు. పండిన పంటకు మార్కెట్‌లో ధర లేక పోవడంతో దళారులకు అతి తక్కువ ధరకు అమ్మలేక... కూ లీల ఖర్చు భరించలేక... పంట ను పొలంలోనే వదిలేశాడు. దీం తో వంకాయలు పండిపోయి... నిరుపయోగంగా మారాయి.

చదువు రూపు మారుతోంది!

- నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కసరత్తు
- ఇతర అంశాలపైనా దృష్టి
- విద్యార్థులకు రవాణా ఖర్చులు


విద్యార్థులకు యోగా నేర్పుతున్న దృశ్యం (ఫైల్)

బొబ్బిలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థలో మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకంతో పాఠశాలల రూపురేఖలు మార్చుతా మని.. నాణ్యమైన విద్యనందిస్తామని ప్రకటించి ంది. కానీ ఆచరణలో విఫలమైంది. ఉపాధ్యాయ లోకమైతే గతంలో ఎన్నడూ లేని విధంగా ఇబ్బందులకు గురయ్యారు. వాటన్నిటికీ చెక్ పెట్టే విధంగా ప్రస్తుత ప్రభుత్వం అడుగులు ముందుకేస్తోంది. నారా లోకేశ్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విద్యావ్యవస్థలో మార్పులు తీసుకు రావాలని తపన పడుతున్నట్లు అనేకమార్లు ప్రకటించారు. దీనికి అనుగుణంగా ఇప్పుడు అడుగులు పడుతున్నాయి.

క్రీడల్లోనూ రాణించేలా...

గత ప్రభుత్వ హయాంలో పెద్ద గుదిబండగా ఉపాధ్యాయ లోకం భావించిన 117 జీవోను ర ద్దు చేయడంతో ఆ వర్గాలు ఊపిరి పీల్చుకుం టున్నాయి. 3, 4, 5 తరగతులను సమీపంలోని హైస్కూళ్లలో విలీనం చేయడంతో ముఖ్యంగా ప్రాథమిక విద్యా వ్యవస్థకు పెను ప్రమాదం ముంచుకొచ్చినట్లు ఉపాధ్యాయులు, మేధావులు, సామాజిక సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చే శాయి. అయినా నాటి ప్రభుత్వం తమ విధానా న్ని బలవంతంగా జనం మీదకి రుద్దింది. దీనితో ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణ నీయంగా పడిపోయినట్లు గణాంకాలు చెబుతు న్నాయి. నూతన ప్రభుత్వ హయాంలో విలీనం ప్రక్రియను వెనక్కి తీసుకోవడంతో ప్రాథమిక విద్యారంగం మళ్లీ ఊపిరి పోసుకుంటోందన్న భావన బలపడుతోంది. విద్యతో పాటు విద్యా యేతర రంగాలలో క్రీడలు, ఇతర అంశాల్లో రాణించేలా ఏర్పాట్లు చేస్తామంటున్నారు.

పక్కాగా ప్రణాళికలు..

వచ్చే విద్యా సంవత్సరం నుంచి గతంలో మాదిరిగా ఎక్కడి పాఠశాలలు అక్కడే అన్నట్లు గా నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పాఠశాలలను తెరిచిన వెంటనే కొన్ని రోజుల పాటు రెడీనెస్ విధానాన్ని అమలు చేయనున్నా రు. కనీస అభ్యసనా సామర్థ్యాలను విద్యార్థుల లో పెంపొందించేందుకు ఈ నూతన విధానా న్ని అమలు చేయనున్నారు. ప్రతి పంచాయతీ పరిధిలో 45 మంది విద్యార్థులు కలిగిన పాఠశా లను మోడల్ స్కూల్‌గా పరిగణించి... అక్కడ జాతీయ నూతన విద్యావిధానానికి అనుగు ణంగా ప్రణాళికలను అమలు చేయనున్నారు. ప్రాథమిక పాఠశాలలను కనీసం 20 మంది విద్యార్థులతో నిర్వహిస్తారు.

తరగతికి ఒక టీచర్..

ఇక మీదట ప్రతి తరగతికి ఒక ఉపాధ్యా యుడు ఉండే విధంగా చర్యలు తీసుకుంటారు. యూపీ స్కూళ్ల వ్యవస్థకు పూర్తిగా మంగళం పలుకుతారు. ఒక వేళ నడపాల్సి వస్తే స్కూల్ అసిస్టెంట్ లేకుండా ముగ్గురు ఎస్‌జీటీలతో వీటిని నిర్వహిస్తారు. మిగిలిన స్కూళ్లన్నిటినీ విద్యార్థుల సంఖ్య ఆధారంగా హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేస్తారు. విద్యాహక్కు చట్టం కింద ప్రతి విద్యార్థికీ నెలకు రూ.600 చొప్పున పదినెలల పాటు రవాణా ఖర్చులు చెల్లిస్తారు.

లీప్ పాఠశాలలు..

నియోజకవర్గానికి ఒకటి చొప్పున 5 అంశాల ప్రాధాన్యంగా లీప్ పాఠశాలలను ప్రవేశపెట్ట నున్నారు. ప్రతి పౌరునికీ సమాన సమ్మిళిత విద్యను అందించడం.. లింగ నిష్పత్తిని పెంచ డం... దివ్యాంగులకు సదుపాయాలు కల్పించ డం... విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధి కోసం నైపుణ్యాలను పెంపొందించడం.. పరిశ్రమ ఆధా రిత నైపుణ్యాలను పెంచడం వంటివి అమలు చేస్తారు. నాలెడ్జి ఎకానమీ, సృజన, పరిశోధన వంటివి పెంచడం, ప్రపంచ ప్రమాణాలతో కూడిన పాఠ్య ప్రణాళికలను అమలు చేయను న్నారు. సర్కారు బడుల్లో ప్రవేశాలకు పోటీ పడే విధంగా రాబోయే రోజులు ఉంటాయని మంత్రి లోకేశ్ చెబుతున్నారు.

మార్పులు ఖాయం..

వచ్చే విద్యా సంవత్సరం నుంచి మంచి మా ర్పులు రానున్నాయి. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి నిర్దిష్టమైన విధానాన్ని రూపొంది ంచారు. రేషనలైజేషన్ వంటి ప్రక్రియ ముగించి విద్యాసంవత్సరాన్ని శుభారంభం చేయాలని ప్రభుత్వం సంకల్పిస్తోంది. 117 జీఓ రద్దవడంతో హైస్కూళ్లలో విలీనమైన 3, 4, 5 తరగతులు మళ్లీ వెనక్కి రానున్నాయి. మోడల్ స్కూలు వ్యవస్థ వస్తుంది. ఉపాధ్యాయులు లేని తరగతు లు, పాఠశాలలు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

-మోహనరావు, డిప్యూటీ డీఈఓ, బొబ్బిలి

సమస్యల పరిష్కారానికి చర్యలు: ఎస్పీ

విజయనగరం క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించారు. సిబ్బంది నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ సిబ్బంది వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతామన్నారు.


విజయనగరం: వినతిని పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్


బెలగాం: వినతిని పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పోలీసుల సంక్షేమానికి కృషి

బెలగాం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో విధులు నిర్వహి స్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించి, వారి సంక్షేమానికి కృషి చేస్తామ ని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాల యంలో ఆయన పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. పోలీసుల సమస్యలు విని, సత్వరమే పరిష్కారానికి అవకాశం ఉన్న వాటిని పరిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీస్ సిబ్బంది, అధికారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని అన్నారు. సిబ్బంది ఫిర్యాదులను విని సాధ్యమైనంత వరకు సమ స్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సీసీ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

వెళ్లి రావడమూ పరీక్షే..

- పదో తరగతి విద్యార్థులకు రవాణా కష్టాలు

సాలూరు రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రస్తు తం పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు సంబంధిత కేంద్రాలకు వెళ్లిరావడమే పెద్ద పరీక్షగా మారింది. ఎండలు మండుతున్న నేపథ్యంలో విద్యార్థు లు వెళ్లి రావడం కష్టంగా మారుతోంది. జిల్లాలో పదో తరగతి పరీక్ష కేంద్రాలు 67 ఉన్నాయి. వాటిలో 22 సీ సెంటర్లు ఉన్నాయి. సీ సెంటర్లకు కేటాయించిన విద్యా ర్థులు పరీక్ష రాయడానికి రోజూ కనీసం పది కిలో మీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ఎండలో ప్రయా ణించడం వీరికి ఇబ్బందిగా మారుతోంది. సాలూరు మండలం కొత్తవలస గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలకు 15 నుంచి 18 కిలోమీటర్ల నుంచి విద్యా ర్థులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ పాఠశాలలో కురుకూటి, తోణాం, మావుడి, అంటివలస, మామిడిపల్లి గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలల నుంచి విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. బొడ్డవ లసకు ఖరాసవలస, మామిడిపల్లి నుంచి 9 కిలోమీటర్లు రాకపోకలు సాగిస్తున్నారు. పెదబొర బంద, బాగువలస, శివరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రోజూ 10 కిలోమీటర్ల మేరకు రాకపోకలు సాగిస్తున్నారు. శుక్రవారం నాటికి తెలుగు, హిందీ, ఇంగ్లీషు పరీక్షలు ముగిశాయి. మరో నాలుగు పరీ క్షలు మిగిలి ఉన్నాయి. మిగిలిన పరీక్షలకైనా ప్రశాంతంగా వెళ్లే లా పూర్తి స్థాయిలో రవాణా సౌకర్యాలు కల్పించాలని విద్యా ర్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థులకు పల్లెవె లుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించారు. కానీ మారుమూల గ్రామాలకు బస్సులు లేకపోవడంతో ఆటోలు, మోటారు సైకిళ్లే దిక్కవు తున్నాయి. ఇక కొన్ని గ్రామాలకు బస్సులు అరకొరగా ఉండ డంతో గంటల తరబడి విద్యార్థులు నిరీక్షించాల్సి వస్తోంది.


బొడ్డవలస జంక్షన్ వద్ద బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థినులు


ఆటోలో వెళుతున్న మామిడిపల్లి విద్యార్థినులు

ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయ్..

- కనీస మరమ్మతులకు నోచుకోని వంతెనలు
- భయాందోళన చెందుతున్న వాహనదారులు, ప్రయాణికులు


రాజాం-శ్రీకాకుళం మధ్య సారధిగెడ్డపై ప్రమాదపుటంచున వంతెన

రాజాం రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని ప్రధాన రహదారుల్లో వంతెనలు, కాజ్‌వేలు ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయి. ఏళ్ల తరబడి కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంలో వాటిపై ప్రయాణం భయంగొల్పుతోంది. పాలకొండ-విశాఖ రోడ్డులో మండలంలోని గురవాం వద్ద కాజ్‌వే పరిస్థితి భయాందోళన కలిగిస్తోంది. ఈ మార్గంలో పాలకొండ-విశాఖ మధ్య నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే ఒడిశా నుంచి వచ్చే వాహనాలు సైతం పాలకొండ, రాజాం మీదుగా జైపూర్, ఇతరత్రా ఒడిశాలోని పట్టణాలకు రాకపోకలు జరుతుంటాయి. రాజాం-శ్రీకాకుళం అంతర్రాష్ట్ర రహదారిలో అంతకాపల్లి సమీప బాలాజీ దేవాలయం వద్ద సారధిగెడ్డపై వందేళ్ల నాటి వంతెన శిథిలరూపు దాల్చింది. 2019లో ట్యాంకర్ ఢీ కొనడంతో వంతెన ఇనుప రెయిలింగ్ విరిగిపోయింది. ఈ వంతెన మీదుగా ఒడిశాలోని జయపూర్-బెర్హంపూర్ పట్టణాల మధ్య వందలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. జిల్లాలోని చీపురుపల్లిలో రెండున్నరేళ్ల కిందట ప్రారంభించిన ఆర్‌వోబీ పనులు నేటికీ ఓ కొలిక్కిరాలేదు. ఫలితంగా రాజాం నుంచి విశాఖ, రాజమండ్రి, విజయవాడ, కాకినాడ, భీమవరం తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనాలు శిథిలమైన సారధిగెడ్డ వంతెన మీదుగా చిలకపాలెం, రణస్థలం మీదుగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అలాగే అంతకాపల్లి-మొగిలివలస గ్రామాల మధ్య సారధిగెడ్డపై వందేళ్ల క్రితం నిర్మించిన వంతెన కూడా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో బిక్కుబిక్కుమంటూ వాహనాదారులు ప్రయాణాలు సాగించాల్సి వస్తోంది.


అంతకాపల్లి-మొగిలివలస గ్రామాల మధ్య వంతెన ఇలా..

టీడీపీ నాయకుడు వెంకటరమణ మృతి


వెంకటరమణ (ఫైల్)

విజయనగరం రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 28వ డివిజన్ లంకవీధికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు సారిక వెంకటరమణ (55) శుక్రవారం మధ్యాహ్నం తన నివాసంలో అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీలో క్రియాశీలకంగా ఉంటూ డివిజన్ పరిధిలో టీడీపీ బలోపేతానికి ఎంతగానో కృషి చేశారు. ఆయన మృతిపై ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, టీడీపీ అర్బన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, నగర టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపారు.

ప్రవేశ పరీక్ష వాయిదా

నెల్లిమర్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 2025-26 సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు వచ్చేనెల 6న జరగనున్న పరీక్ష వాయిదా వేసి నట్టు నెల్లిమర్ల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి ఓ ప్రకటనలో తెలిపారు. దీన్ని వచ్చేనెల 13న పరీక్ష నిర్వహించనున్నట్టు ఆమె పేర్కొన్నారు.

ఓటరు నమోదుపై అలసత్వం వద్దు

రేగిడి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదు, తొలగింపుపై బీఎల్‌వోలు అలసత్వం వహించవద్దని నియోజకవర్గం ఎలక్షన్ డీటీ ప్రకాశ్, తహసీల్దారు చిన్నారావు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఓటు చేర్పులు, మార్పులు, నమోదుపై బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు.

క్లాప్‌మిత్రలకు శిక్షణ

రాజాం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోపేరులో నియోజకవర్గ పరిధిలోని 9 మంది పంచాయతీ కార్యదర్శులు, 35 మంది క్లాప్ మిత్రలకు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై రెండో రోజు శుక్రవారం డీఎల్‌పీవో మోహన్‌రావు. ఎంపీడీవో శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. చెత్తను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలదేనన్నారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ప్రణాళికలు తయారు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని వారు అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ కళాశాలల్లో చేరండి

రాజాం రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో చేరి మెరుగైన విద్యతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కామేశ్వరరావు విద్యార్థులను కోరారు. పదోతరగతి పరీక్ష కేంద్రాల వద్ద ఉపాధ్యాయ బృందంతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు.

నేడు భూసమస్యలపై స్పెషల్ డ్రైవ్

మెంటాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూసమస్యల పరిష్కారానికి శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు తహసీల్దారు కార్యాలయంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు తెలిపారు. భూమి అనుభవంలో ఉండి పాత డాక్యుమెంట్ల వల్ల దరఖాస్తు చేయలేకపోతున్న వారు, మరణ ధ్రువీకరణ పత్రం లేనందున మరణించిన వ్యక్తి వారసులకు పట్టాదారు పుస్తకాలు మంజూరు కాని వారు, అలాగే ఇతర సమస్యలు ఉన వారు సంబంధిత ఆధారాలతో హాజరుకావచ్చని తహసీల్దారు తెలిపారు.

బీసీ రుణాలపై అవగాహన కల్పించండి

రాజాం రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వెనుక టబడిన తరగతుల వారికి ప్రభుత్వం అందజేస్తున్న రాయితీ రుణాలు, కుట్టు మిషన్లకు సంబంధించి ఆన్‌లైన్ విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి తేజేశ్వరరావు సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా అధికారి రత్నంతో కలిసి వెల్ఫేర్ కార్యదర్శులు, ఆర్పీలతో సమావేశమయ్యారు.

రేపు మండల సమావేశం

గరివిడి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మీసాల విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి సభ్యులు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

ఇఫ్కో జాతీయ డైరెక్టర్‌గా బంగార్రాజు


ఎన్నిక ధ్రువపత్రాన్ని అందుకుంటున్న బంగార్రాజు

భోగాపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్స్ కోపరేటివ్ లిమిటెడ్ (ఇఫ్కో) సంస్థ జాతీయ డైరెక్టర్‌గా ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు ఎన్నికయ్యారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ అనుబంధ సంస్థల ముఖ్యమైన వారికి ఎన్నికలు నిర్వహించి డైరెక్టర్‌గా నియమించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ తరుణంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు రెండు రోజుల క్రితం డైరెక్టర్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన ఇఫ్కో డైరెక్టర్‌గా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారులు ప్రకటించినట్టు మార్కెటింగ్ శాఖ వర్గాలు తెలిపాయి. ఇఫ్కో ద్వారా దేశంలోని రైతులకు ఎరువుల తయారీ, పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతులకు సంబంధించి విత్తనాలు సరఫరా మొదలుకుని ఎరువులు, వ్యవసాయ యాంత్రిక విధానం అవలంబించే విధంగా నేరుగా క్షేత్రస్థాయిలో పొలంలోకి వ్యవసాయ సంబంధిత శాఖాధికారులను పంపించి నిరంతరం పర్యవేక్షణలో ప్రభుత్వం తనదైన శైలిలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేస్తుందన్నారు. ఇఫ్కో డైరెక్టరుగా రాష్ట్ర రైతాంగానికి మెరుగైన విధంగా ఎరువుల సరఫరాలో ప్రధానపాత్ర పోషిస్తానని, ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

జీవనోపాధి యూనిట్లు వినియోగించుకోండి


డెయిరీ ఫారంను పరిశీలిస్తున్న డీపీఎం

రేగిడి, మార్చి21 (ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ, పీవోపీ ఉన్నతి పథకాల ద్వారా అందిస్తున్న జీవనోపాధి యూనిట్లను స్వయంశక్తి సంఘాల మహిళలు వినియోగించుకోవాలని జీవనోపాధి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డా.మూర్తి, వెలుగు రాజాం ఏరియా కో-ఆర్డినేటర్ ఎ.చిరంజీవి సూచించారు. మండలంలో వెంకమపేటలో మహిళకు మంజూరు చేసిన డెయిరీ ఫారం యూనిట్‌ను డీపీఎం, రాజాం ఏసీతో కలిసి పరిశీలించారు. మండలంలో రూ.12 కోట్లతో స్త్రీనిధి, రూ.45 కోట్లతో బ్యాంక్ లింకేజీ, ఇంకా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పీవోపీ కింద మరో రూ.60 లక్షలతో జీవనోపాధి రుణాలు అందించినట్లు ఏసీ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం గోవిందరావు, మహిళా సమాఖ్య ప్రతినిధులు ఉన్నారు.

'స్థానికుల తొలగింపునకు కుట్ర'


వాల్‌పోస్టర్ల విడుదల చేస్తున్న నాయకులు

చీపురుపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కర్లాంలోని వెంకటరామ పౌల్ట్రీస్‌లో పనిచేస్తున్న స్థానిక కార్మికులను తొలగించి వేరే రాష్ట్రాలకు చెందిన వారితో పనిచేయించేందుకు కంపెనీ యాజమాన్యం కుట్ర పన్నుతోందని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. 2019 చట్టం ప్రకారం ఉద్యోగాల్లో 75 శాతం స్థానికులకు కేటాయించాలన్న 2019 చట్టానికి యాజమాన్యం తూట్లు పొడుస్తోందన్నారు. కర్లాం పౌల్ట్రీస్ కార్మికుల సమస్యలపై ముద్రించిన వాల్‌పోస్టర్‌ను సీఐటీయూ జిల్లా ప్రతినిధి రమణ, అంబల్ల గౌరునాయుడు చీపురుపల్లి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విడుదల చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. మంగళ, బుధవారాల్లో ప్రజలను కలుస్తామన్నారు. ఈనెల 27న చీపురుపల్లిలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి, తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని వారు తెలిపారు.

నగర పంచాయతీలో వార్డుసభలు


వార్డు సభలో నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ సరోజిని

నెల్లిమర్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీలో శుక్రవారం పి-4 వార్డు సభలు నిర్వహించారు. జరజాపుపేట-1, 2, మొయిద జంక్షన్ 1, 2, గాంధీనగర్ కాలనీ, సచివాలయ పరిధిలో వార్డు సభలు జరిగాయి. ఈ సందర్భంగా నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజిని మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ప్రజల భాగస్వామ్యంతో పి-4 కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. దాన్ని అందరూ విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్‌పర్సన్ సముద్రపు రామారావు, వార్డు కౌన్సిలర్స్ మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాల మంజూరు పూర్తిచేయండి


మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులు కేటాయించిన లక్ష్యాల మేరకు ఈనెలఖారులోగా పథకాలను మంజూరు చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న విశ్వకర్మ పథకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మంజూరు చేసిన 2,624 యూనిట్లు వెంటనే గ్రౌండింగ్ చేయాలన్నారు. ఖాదీ బోర్డు ద్వారా మంజూరు చేసిన యూనిట్లు సంఖ్య తక్కువగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలోని 16,135 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయగా 1395 మందికి మాత్రమే రూ.7 కోట్ల రుణాన్ని ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నాబార్డు డీడీఎం నాగార్జున మాట్లాడుతూ వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాబార్డు ద్వారా సుమారు రూ.10,650.32 కోట్ల అంచనాతో రుణ ప్రణాళికను రూపొందించడం జరిగిందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల కోసం రూ.5858.944 కోట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పనకు రూ.175.20 కోట్ల ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రణాళికను కలెక్టరు ఇతర అధికారులు ఆవిష్కరించారు.

- కేంద్ర ప్రభుత్వం రక్తహీనతను నివారించేందుకు ప్రవేశ పెట్టిన పలు పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేస్తుండటం వల్ల రక్తహీనత తగ్గిందని జిల్లాలో పర్యటించిన కేంద్ర ప్రభుత్వ వైద్య నిపుణులు బృందం అభిప్రాయ పడింది. రెండు రోజులుగా రక్తహీనత తగ్గడానికి గల కారణాలపై అధ్యయం చేసిన బృందం ప్రతినిధులు ఐపీఏ -ఇండియా సంస్థ ఆరోగ్య వ్యవస్థ విధాన పరిశోధనకు చెందిన సీనియర్ మేనేజర్ డాక్టరు దృష్టి శర్మ, ప్రత్యేక నిపుణులు డాక్టరు జాస్మిన్ శుక్రవారం సాయంత్రం కలెక్టరు అంబేడ్కర్‌ను కలిసి వివరించారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో కానిస్టేబుల్ ప్రతిభ

విజయనగరం క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో ట్రాఫిక్ కానిస్టేబుల్ బీఎస్‌ఆర్ మూర్తి ఇటీవల పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో జరిగిన ఆల్ ఇండియా పోలీసు క్లస్టర్ పోటీల్లో సత్తా చాటారు. ఫెన్సింగ్ విభాగంలో జాతీయ స్థాయిలో కాంస్య పతకం సాధించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ జలంధర్‌లోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఈనెల 2 నుంచి 6 వరకూ పోటీలు జరిగాయన్నారు. పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీసు జట్లు పాల్గొనున్నాయన్నారు. జిల్లాకు చెందిన బీఎస్‌ఆర్ మూర్తి ఫెన్సింగ్ విభాగంలో సీనియర్స్ ఫోయిల్స్‌లో రాష్ట్ర పోలీసు జట్టు తరఫున పాల్గొని కాంస్య పతకం సాధించారన్నారు. జాతీయ స్థాయిలో పతకం సాధించిన మూర్తిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐ గోపాలనాయుడు, ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, ఎస్బీ సీఐ లీలారావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్లలో వైద్య బృందం పర్యటన


సర్వే చేపడుతున్న వైద్య బృందం

గుర్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గుర్లలో శుక్రవారం ఫైలేరియా వ్యాధిపై ఇంటింటి వైద్య సిబ్బంది సర్వే నిర్వహించారు. గత నెలలో నిర్వహించిన సామూహిక ఫైలేరియా నివారణ కార్యక్రమం తీరును పరిశీలించేందుకు ప్రభుత్వం ఒక బృందాన్ని పంపించింది. బృందంలో డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ కేశవ్, స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు కె.శ్రీధర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకాశ్‌కు పతంజలి పురస్కారం

విజయనగరం బాబామెట్ట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పాత్రికేయుడు, సినీపాటల రచయిత కేఎస్‌వై పతంజలి జయంతి సందర్భంగా రచయిత తాడి ప్రకాశ్‌కు పురస్కారం అందజేయనున్నట్టు పతంజలి సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. శుక్రవారం గురజాడ అప్పారావు స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా పతంజలి జయంతి సందర్భంగా ప్రముఖులకు పురస్కారం అందజేస్తున్నామన్నారు. కార్టూనిస్ట్ మోహన్, దేవీప్రియ, శరత్ చంద్ర, జీఆర్ మహర్షి, పప్పు, అరుణ, అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరీ నాయుడులకు ఈ పురస్కారం అందజేసినట్టు తెలిపారు. సమావేశంలో వేదిక ప్రతినిధులు వీఎం లక్ష్మణరావు, బళ్లమూడి నాగేంద్రప్రసాద్, ఎన్.కె.బాబు, రామచంద్ర రాజు, రామ్మోహన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన


మాట్లాడుతున్న విద్యార్థినులు

నెల్లిమర్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): దేశం లో ప్రతీ ఎనిమిది మందిలో ఒకరు రొమ్ము క్యాన్సర్‌తో బాధ పడుతున్నారని రేడియాలజీ విభాగం విద్యార్థులు పి.యోషిశ్రీన్, ఇందు పల్లవి, జాహ్నవి పేర్కొన్నారు. శుక్రవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకా రం పేదరికం, అనియంత్రిత జీవనశైలి రొ మ్ము క్యాన్సర్‌కు ప్రధాన కారణమన్నారు. ఇది కాకుండా జన్యుపరంగా కూడా రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. రొమ్ము చర్మంలో ఏదైనా మార్పు, చను మొనలలో మార్పులు, రొమ్ము నొప్పి, రొమ్ములో గడ్డ ఉంటే వెంటనే వైద్యుడిని సం ప్రదించాలన్నారు. కార్యక్రమంలో రేడియాలజీ హెచ్‌వోడీ ఆసిఫ్‌లోనె, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా తవ్వేస్తున్నారు

విజయనగరం రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని గాజులరేగ పరిధిలో ఏయూ కళాశాల క్యాంపస్, వైద్య కళాశాల మధ్యలో అక్రమంగా గ్రావెల్ తవ్వేస్తున్నారు. రాత్రి పూట లారీలు, ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్ తరలిపోతోంది. సచివాలయ సిబ్బంది సైతం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ఇకనైనా గ్రావెల్ అక్రమ తవ్వకాలపై అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.


గ్రావెల్ తవ్వకాలు చేపట్టిన ప్రాంతం

చికిత్స పొందుతూ ఉపాధ్యాయుడి మృతి

బొబ్బిలి/రామభద్రపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రోత్ సెంటరు సమీపంలో ఈనెల 4న ఆటో ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పూసర్ల విశ్వేశ్వరరావు(54) విశాఖపట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. రామభద్రపురం గ్రామానికి చెందిన విశ్వేశ్వరరావు బొబ్బిలి జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈనెల 4న సాయంత్రం బొబ్బిలి వచ్చి తిరిగి బైకుపై వెళ్తుండగా నారాయణప్పవలస గ్రామానికి చెందిన ఆటో ఢీకొంది. దీంతో ఆయన తీవ్రగా యాలపాలయ్యారు. బైకుపై వెనుక కూర్చున్న విశ్వేశ్వరరావు రోడ్డుపక్కన ఆగి వాహనం దిగినప్పుడు ఆటో వచ్చి బలంగా ఢీకొన్నట్టు పోలీసులు కేసు నమోదు చేశారు. గాయపడిన విశ్వేశ్వరరావును స్థానిక సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం విశాఖ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం ఆయన కన్నుమూశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు ఎస్ఐ జ్ఞానప్రసాద్ అప్పగించారు. మృతుడికి భార్య లలిత, కుమారుడు దివాకర్, కుమార్తె రమణి ఉన్నారు. విశ్వేశ్వరరావు ఆకస్మిక మృతిపై రామభద్రపురంలో విషాదఛాయలు అలముకున్నాయి.

తోటపల్లి ప్రాజెక్టులో మృతదేహం

గరుగుబిల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో శుక్రవారం ఓ మృతదేహాన్ని గుర్తించారు. ఎస్ఐ పి.రమేష్‌నాయుడు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్పిల్‌వే రెగ్యులేటర్ ప్రాంతంలో మృతదేహం ఉన్నట్టు శుక్రవారం స్థానిక పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు వారు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు పార్వతీపురం పట్టణానికి చెందిన ఆలవెల్లి రాజు(26)గా గుర్తించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. తోటపల్లి, సుంకి వీఆర్వోలు టి.రవికుమార్, పి.రామకృష్ణ సమక్షంలో శవ పంచనామా చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం కేంద్రాసుపత్రికి తరలించారు.

పోక్సో కేసులో యువకుడికి 12 ఏళ్ల జైలు

భామిని, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో బిల్లుమడ గ్రామానికి చెందిన యువకుడు మండల శివకకు 12 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు తీర్పు వెల్లడించిందని బత్తిలి ఎస్ఐ బి.అనీల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021లో బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో బత్తిలి పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేశారు. ఆ కేసును శ్రీకాకుళం దిశ పోలీస్‌స్టేషన్ సీఐ లలితకుమారి దర్యాప్తు చేశారు. నేరం నిరూపణ కావడంతో శివకు 12 ఏళ్ల జైలుశిక్ష ఖరారు చేస్తూ కోర్టు తీర్పు వెల్లడించిందని ఎస్ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

భామిని, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): భామిని సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి వంతెన కింద పడటంతో ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పసుకుడి గ్రామానికి చెందిన ఎం.మనోజ్, రాణి, జయరాం ఒకే వాహనంలో పసుకుడి నుంచి లివిరి యాత్రకు వెళుతుండగా ప్రమాదం జరిగింది.108 అంబులెన్స్ సాయంతో స్థానికులు కొత్తూరు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించినట్టు 108 సిబ్బంది తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ: ఇద్దరికి గాయాలు

సీతంపేట రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలో మానడుగూడ జంక్షన్ వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో యువకులు ఎస్.గణపతి, టి.మనోజ్ గాయపడ్డారు. శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకులను స్థానికులు సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైన గణపతిని మెరుగైన వైద్య సేవల కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

మద్యంతో వ్యక్తి అరెస్టు

విజయనగరం క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గరివిడి మండలం దుమ్మెదలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇజ్జరపు నారాయణరావును శుక్రవారం అరెస్టు చేసి అతడి నుంచి 16 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సింహాద్రి తెలిపారు. దాడుల్లో ఈసీలు నాయుడు, జనార్దన్‌రావు పాల్గొన్నారన్నారు

- భోగాపురం: మండలంలోని అప్పన్నపేటలో మద్యం బెల్టుషాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసి అతడి నుంచి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ అధికారి రవికుమార్ తెలిపారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మద్యం దుకాణాలకు వేలంపాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇద్దరు మహిళల అదృశ్యం

బాడంగి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): అల్లువానివలస గ్రామానికి చెందిన దంపరి కల్యాణి గురువారం సాయంత్రం నుంచి కనిపించడం లేదు. దీంతో ఆమె తండ్రి తంపర లక్ష్మణ శుక్రవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే బొంతు కృష్ణవేణి అదృశ్యమైనట్టు ఆమె భర్త రామునాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డొంకినివలసకు బొంతు కృష్ణవేణి తన కన్నవారి ఇంటికి ఈనెల 13న వచ్చింది. తిరిగి తన అత్తవారిల్లు రాజాం మండలం గడిముడి గ్రామానికి ఈనెల 19న బస్సులో ఏడాదిన్నర కుమారుడితో బయలుదేరి వెళ్లింది. అప్పటి నుంచి తన భార్య కనిపించడం లేదని రామునాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాడంగి ఎస్ఐ తారకేశ్వరరావు వేర్వేరుగా కేసులు నమోదు చేశారు

దీక్ష విరమించిన పశు వైద్య విద్యార్థులు

- 23 నుంచి తరగతులకు హాజరు


డీన్‌కు అంగీకారపత్రాన్ని అందజేస్తున్న విద్యార్థులు

గరివిడి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గరివిడిలో పశువైద్య కళాశాల విద్యార్థులు దీక్షలు నిలుపుదల చేసి సోమవారం నుంచి తరగతులకు హాజరవుతామని కళాశాల డీన్ ఎం.శ్రీనుకు శుక్రవారం అంగీకారపత్రం అందజేశారు. 45 రోజుల నుంచి స్టైఫండ్ పెంచాలని కోరుతూ విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. వివిధ రకాల నిరసనలు తెలిపారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం స్టైఫండ్‌ను పెంచుతూ 3 రోజుల కిందట జీవో విడుదల చేయడంతో విద్యార్థులు తమ ఆందోళనను విరమిస్తున్నట్టు ప్రకటించారు. సోమవారం తరగతులకు హాజరుకానున్నట్టు ప్రకటించారు.

టెండ'రింగ్' అయ్యారు.. తక్కువకు పాడారు


వేలం పాటదారులు కుమ్మక్కైన దృశ్యం

జామి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన జామి పంచాయతీ రోజువారీ మార్కెట్ వేలం పాటలో టెండర్‌దారులు రింగ్ అయ్యారు. శుక్రవారం నిర్వహించిన వేలం పాటలో సుమారు 60 మంది పాల్గొన్నారు. దాంతో రోజువారీ మార్కెట్ పాట గత ఏడాదికంటే గణనీయంగా పెరుగుతుందని అందరూ భావించారు. అయితే అందుకు భిన్నంగా వ్యవహారం సాగింది. కొంతమంది వ్యక్తులు వేలం పాట పెరగకుండా ప్రణాళిక వేశారు. గతేడాది రూ.5.40 లక్షల పాటను ఈ సారి తక్కువకు పాడేందుకు పాటదారులు సిద్ధమయ్యారు. దాంతో సర్పంచ్ లక్ష్మి, ఉప సర్పంచ్ అల్లు పద్మ అడ్డుకున్నారు. మరీ తక్కువకు వేలం వేయలేమని తేల్చేశారు. తుదకు మార్కెట్ పాటను రూ. 5,80,600కు ఖరారు చేశారు. వేలం పాట సక్రమంగా జరిగితే రూ.లక్షకు పైగా అదనపు ఆదాయం పంచాయతీకి సమకూరేదని వారు అభిప్రాయపడ్డారు. వేలం పాట పంచాయతీ ఈవో రమణరావు ఆధ్వర్యంలో జరిగింది.

ప్రజారోగ్యానికి భంగం కలిగిస్తే ఊరుకోం



మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

తెర్లాం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎంఆర్ అగ్రహారం ప్రాంతంలో ఎస్ఎస్ఆర్ అల్లాయ్స్ కంపెనీ ఏర్పాటుకు తామంతా సమ్మతమేనని, ఇదే సమయంలో ప్రజారోగ్యానికి భంగం కలిగిస్తే అంగీకరించేది లేదని మండల పరిధిలోని ఎంఆర్ అగ్రహారం, మెరకముడిదాం మండలం ఉత్తరావల్లి, ఎం.గదబవలస గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. ఎంఆర్ అగ్రహారం పరిధిలోని ఎస్ఆర్ అల్లాయ్స్ కర్మాగారం ఏర్పాటుకు కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. డీఆర్వో శ్రీనివాసమూర్తి, చీఫ్ ఇంజినీర్ ప్రసాదరావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత, తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఎస్ఐ సాగర్‌బాబు తదితరుల ఆధ్వర్యంలో కర్మాగారం ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంఆర్ అగ్రహారం సర్పంచ్ ప్రతినిధి లొట్టి వెంకటరావు, గదబవలస సర్పంచ్ రేగాన సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ.. ప్రజారోగ్యానికి భంగం కలిగించే చర్యలు లేకపోతే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. కర్మాగారం నుంచి వెలువడే వ్యర్థాలు చెరువులు, బహిరంగ ప్రదేశాల్లోకి రాకూడదని వారిద్దరు స్పష్టం చేశారు. ప్రధానంగా కర్మాగారంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు స్థానికులకే కల్పించాలని డిమాండ్ చేశారు. దీంతో కర్మాగారం ఏర్పాటుకు రూ.42.8 కోట్లు వెచ్చిస్తున్నామని, ఇందులో అధునాతన టెక్నాలజీ వాడుతున్నామని, కాలుష్యం వెదజల్లే పరిస్థితులు ఎదురు కావని, వ్యర్థాలు కర్మాగారం ప్రాంగణంలోనే నియంత్రించేలా చర్యలు తీసుకుంటామని కర్మాగార అధినేత సాగిరాజు స్పష్టం చేశారు.

ఘనంగా డౌన్‌సింద్రోమ్ డే

బాడంగి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన అనురాగ్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల సహకారంతో ప్రపంచ డౌన్‌సింద్రోమ్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా సహిత విద్య సమన్వయకర్త సరికి సూర్యారావు మాట్లాడుతూ డౌన్‌సింద్రోమ్ అనేది ఒక జన్యుపరమైన వ్యాధి అన్నారు. జిల్లాలో 3,500 మంది దివ్యాంగ పిల్లలకు సమగ్రశిక్ష ద్వారా చదువుతోపాటు భవిత కేంద్రాల ద్వారా ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, రెమెడియల్ టీచింగ్‌తోపాటు అవసరమైన ఉపకరణాలు ఉచితంగా అందజేస్తున్నట్టు తెలిపారు. అనంతరం డౌన్ సింద్రోమ్ దివ్యాంగులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున 10 మందికి అనురాగ్ పాఠశాల సమకూర్చిన చెక్కులను అందజేశారు. సమగ్ర శిక్ష ఏఎంవో ప్రసాద్, ఐఈఆర్పీ సత్యనారాయణ, దివ్యాంగ పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్‌ను వినియోగించుకోండి

బొబ్బిలి రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు బిల్లులు తగ్గించుకోవాలంటే ప్రతిఒక్కరూ సౌర విద్యుత్‌ను వినియోగించుకోవాలని బొబ్బిలి విద్యుత్ శాఖ జేఈ అనంతరావు అన్నారు. శుక్రవారం కమ్మవలస గ్రామంలో సర్పంచ్ పి.వసుంధర ఆధ్వర్యంలో పీఎం సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై సోలార్ ప్యానెల్స్‌ను అందిస్తుందని చెప్పారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్, సచివాలయం సిబ్బంది, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆధార్ నమోదు కేంద్రాలు

బొబ్బిలి రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల లోపు చిన్నారులకు ప్రత్యేకంగా ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎంపీడీవో పి.రవికుమార్ తెలి పారు. కాశిందొరవలస గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆయన శుక్ర వారం పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాల యంలోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. గ్రామంలో గల ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ నమోదు వేగవంతం చేయాలని సూచించారు.

పల్లె పండుగ పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలి

బొబ్బిలి రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలో మంజూరైన అభివృద్ధి పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని పీఆర్ డీఈఈ సీహెచ్‌వీ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం తమ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గంలో 384 పనులకుగాను రూ.27 కోట్లు మంజూరవ్వగా ఇప్పటి వరకు 306 పనులు పూర్తి చేశామన్నారు. రూ.16కోట్లు బిల్లులు పేమెంట్ కోసం సమర్పించగా రూ.2.50 కోట్లు బిల్లులు కాంట్రాక్టర్లకు జమ అయ్యాయన్నారు. మిగిలిన పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేసి బిల్లులు సమర్పించాలని కాంట్రాక్టర్లకు ఆదేశించినట్టు చెప్పారు.

స్థైర్యానందస్వామికి ఘన స్వాగతం


స్వామీజీకి స్వాగతం పలుకుతున్న దృశ్యం

బొబ్బిలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రణవానంద ఆశ్రమ పీఠాధిపతి స్థైర్యానంద స్వామికి శుక్రవారం బొబ్బిలిలో హిందూ సంస్థల ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈనెల 23న లచ్చయ్యపేటలో స్వామి దయానంద సరస్వతి విగ్రహావిష్క రణకు ఆయన విచ్చేశారు. బొబ్బిలి అగ్రహారం వీధిలో నూతనంగా పునర్నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయం, తారకరామ కాలనీలో నూతన ఆలయం, పాతబొబ్బిలి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. సందర్భంగా అయనకు హిందూసంస్థల ప్రతినిధులంతా ఘనస్వాగతం పలికారు. బైకులతో ర్యాలీ చేశారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

బలిజిపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు బకాయి పడ్డ ఆరు వారాల పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలంటూ ఉపాధి కూలీలు ధర్నా చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బలిజిపేట మండల ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పీసా వెంకటస్వామి, కార్యదర్శి నల్ల ఈశ్వరరావులు మాట్లాడుతూ వ్యవసాయ పనులు లేక ఇతర రాష్ట్రాలకు, జిల్లాలకు సుమారు 6వేల మంది వలసలు పోయారన్నారు. ఈ వలసలు నివారించాలంటే తక్షణమే ఉపాధిహామీ పనులు కల్పించాలన్నారు. ఆరు వారాల పనులకు తక్షణమే బిల్లులు చెల్లించాలని కోరారు. ఈ మేరకు ఈవోపీఆర్డీ పుష్పరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు పాల్గొన్నారు.

న్యాయవాద సంఘం ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

కొత్తవలస, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస న్యాయవాద సంఘానికి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ ఇచ్చిన ఆదేశాల మేరకు శుక్రవారం నామినేషన్‌ల ప్రక్రియ మొదలైంది. నామినేషన్లు వేయడానికి ఒక్కరోజు మాత్రమే గడువు ఇవ్వడంతో ఎన్నికల అధికారి గాలి ఈశ్వరరావుకు శుక్ర వారం అధ్యక్ష పదవికి ఒక్కరే నామినేషన్ వేశారు. ప్రధాన కార్యదర్శి పదవికి రెండు, ఉపాధ్యక్ష పదవికి రెండు, జాయింట్ సెక్రటరీ పదవికి రెండు నామినేషన్‌లు దాఖలు అయ్యాయి. శనివారం మధ్యాహ్నం 12 నుంచి 1 గంటల వరకు నామినేషన్ పత్రాల పరిశీలన, 24న నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు ఉంటుందని ఎన్నికల అధికారి తెలిపారు. 26న ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వరకు న్యాయవాద సంఘం హాల్‌లో ఓటింగ్ ఉంటుందన్నారు. అదే రోజు సాయంత్రం లెక్కింపు నిర్వహించి ఫలితాలను వెల్లడించనున్నారు.

వైద్యాధికారి లేక.. ఇబ్బందులు తప్పక

- పశువులకు వైద్యం అందని వైనం
- అవస్థలు పడుతున్న పాడిరైతులు


గరుగుబిల్లి పశు వైద్య కేంద్రం

గరుగుబిల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి పశు వైద్యాధికారి లేకపోవడంతో పాడి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో ఏడీగా విధులు నిర్వహించిన గణపతిరావు శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో సీతానగరంలో ఏడీగా విధులు నిర్వహిస్తున్న దీనకుమార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఈయన ఖాళీ సమయంలోనే పశు వైద్య కేంద్రానికి వస్తుంటారు. గత కొద్ది నెలలుగా పాడి పశువులకు వైద్య సేవలు అందని పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం వేసవిలో పాడి పశువులకు వ్యాధులు ఆశించే పరిస్థితి ఉంది. పూర్తిస్థాయిలో వైద్యాధికారి లేకపోవడంతో నిత్యం రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

ఎల్ఎఫ్ఏ పోస్టు ఖాళీ

కేంద్రంలో ఎల్ఎఫ్ఏగా పనిచేసిన వ్యక్తికి జేఏవోగా పదోన్నతి లభించడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. వైద్యాధికారి లేని సమయంలో ఎల్ఎఫ్ఏ సేవలను అందించేవారు. ప్రస్తుతం సేవలు అందించాల్సిన ఇద్దరూ లేకపోవడంతో సకాలంలో సేవలు అందడం లేదు. సంబంధిత జిల్లా అధికారులు దృష్టి సారించి మండల కేంద్రంలోని ఏడీ స్థానాన్ని భర్తీ చేసి మెరుగైన సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

నాగూరులో ఇన్‌చార్జి వైద్యాధికారే..

నాగూరులో ఇన్‌చార్జి వైద్యాధికారే సేవలు అందిస్తున్నారు. మండలానికి సంబంధించి మండల కేంద్రంలో ఏడీ స్థానం, అలాగే నాగూరులో వైద్యాధికా రి స్థానం, గరుగుబిల్లిలో ఎల్ఎఫ్ఏ స్థానాన్ని భర్తీ చేయాల్సి ఉంది.

వైద్యాధికారులను భర్తీ చేయాల్సి ఉంది

దీనిపై ఉల్లిభద్ర వైద్యాధికారి ఎస్.సురేష్‌కుమార్‌ను సంప్రదించగా.. ప్రస్తుతం గరుగుబిల్లి, నాగూరులలో వైద్యాధికారులను భర్తీ చేయాల్సి ఉందన్నారు. అత్యవసర సమయాల్లో గరుగుబిల్లిలో సేవలు అందిస్తున్నామని తెలిపారు. నియామకం విషయమై జిల్లా అధికారులకు నివేదించామని చెప్పారు.

ఆ రోడ్డు.. అలా వదిలేశారు!

(ఐదో పేజీ తరువాయి)

రెండు కిలోమీటర్ల దూరంలో జాకేరు, గుడివాడ, కరకవలస, చామలాపల్లి, దబ్బిరాజుపేట గ్రామాలు ఉన్నాయి. సోంపురం గ్రామాన్ని కలుపుకుని జాకేరు, కరకవలస, చామలాపల్లి, దబ్బిరాజుపేట గ్రామాల నుంచి వల్లంపూడి వరకు ఈ రోడ్డుకు అనుసంధానంగా మరో రోడ్డు కూడా ఉంది. ఈ రోడ్డు పక్కన గ్రామాలు, వీటి శివారు గ్రామాలు మారిక, వెంకయ్యపాలెం, పోతుబందిపాలెం వాసులు ఎటు నుంచి ఎటు వెళ్లాలన్నా సోంపురం-అనందపురం రోడ్డుకు రావాల్సిందే. అలాగే సీతంపేట సమీపం నుంచి ఆతవ గ్రామానికి ఉన్న రెండు కిలోమీటర్ల రోడ్డు నుంచి కూడా సోంపురం-అనందపురం రోడ్డుకే రావాలి. వేపాడ మండల కేంద్రం నుంచి వాయిల్పాడు గ్రామానికి రోడ్డు ఉంది. ఈ రోడ్డుకు అనుకుని విలుపర్తి, దుంగాడ, చామలడవి వంటి చిన్నచిన్న గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల ప్రజలు కూడా వేపాడ మండల కేంద్రం వద్ద ఉన్న సోంపురం-అనందపురం రోడ్డు నుంచే ప్రయాణం చేయాలి. బానాది, బల్లంకి గ్రామాల నుంచి ఇదే పరిస్థితి. ఇలా మండలంలోని దాదాపు 32 పంచాయతీలకు చెందిన ప్రజలకు కీలక ఆధారం ఈ రోడ్డు. మండల వ్యవస్థ ఆవిర్భావం నుంచి ఈ రోడ్డు అభివృద్ధితో పాటు విస్తరణ కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు.

రెండేళ్ల తర్వాత పనులు..

జిల్లాలో వేపాడ మారుమూల మండలం కావడంతో ఎన్నో ఏళ్లగా ఈ రోడ్డు విస్తరణ కోసం స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర విభజన అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈ రోడ్డుకు నిధులు కేటాయించింది. రోడ్డుపనులు చేపట్టేలోపు ప్రభుత్వం మారింది. 2019లో వైసీపీ అధికారం చేపట్టింది. పనులు వెంటనే చేపడితే టీడీపీకి పేరొస్తుందని భావించి కొద్దిరోజులు ఈ రోడ్డు పనులను మూలన పెట్టింది. రెండేళ్ల తర్వాత పనులు చేపట్టినా సగంలోనే వదిలేసింది. ఆతర్వాత మొదలుపెట్టి ఎన్నో ఏళ్లుగా జరగని రోడ్డు అభివృద్ధి తాము చేపడుతున్నామని గత వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు గొప్పలు చెప్పుకున్నారు. దీంతో వేపాడ, శృంగవరపుకోట, లక్కవరపుకోట, అనకాపల్లి జిల్లా కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. అయితే ప్రజల ఆనందాన్ని వైసీపీ ప్రభుత్వం ఆవిరి చేసింది. సీతంపేట గ్రామానికి ఇరువైపులా కిలోమీటరు పైబడి విస్తరణకు కాంట్రాక్టర్ రోడ్డు తవ్వేసి వదిలేశారు. రాతిపిక్కను పరిచినా వర్షాలకు లేచిపోయి రోడ్డు గుంతలుగా మారింది. దబ్బిరాజుపేట గ్రామానికి వేళ్లే లింకు రోడ్డు వద్ద, వల్లంపూడి కల్లాల వద్ద ఉన్న బస్సుషెల్టర్ సమీపంలో అయితే భారీ గుంతలు పడ్డాయి. బరువుతో వచ్చే వాహనాలు ఎక్కడ బోల్తాడతాయోనని డ్రైవర్లు భయపడుతున్నారు. వేపాడ-వల్లపూడి జంటగ్రామాల మధ్య కూడా ఇలాంటి గోతులే ఉన్నాయి. జగ్గయ్యపేట దాటిన తరువాత వేపాడ వేళ్లే రోడ్డులో మలుపు వద్ద గుంతలు మరింత ప్రమాదంగా మారాయి. భర్తవానిపాలెం సమీపంలోను ఇదే పరిస్థితి. ఈ నేపథ్యంలో ఈ రహదారి మీదుగా ప్రయాణం చేయాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు.

● రోడ్డు విస్తరణలో భాగంగా గ్రామాల్లో నివాసాలను ఇంకా తొలగించాల్సి ఉంది. వేపాడ-వల్లంపూడి గ్రామాల్లో సగం తొలగించి వదిలేశారు. నివాసాల్లో రోడ్డుకు అవసరమయ్యే భాగాన్ని తొలగించేందుకు కొన్ని గ్రామాల్లో మార్కింగ్ కూడా ఇచ్చారు. మార్కింగ్ వరకు తొలగిస్తే మిగిలిన స్థలంలో కొత్త ఇళ్లు కట్టుకోవచ్చని ప్రజలు భావిస్తున్నారు. ఇప్పుడు విస్తరణ పనులు ఆపేయడంతో స్థలమెంత పోతుందో తెలియక వారంతా అయోమయంలో పడ్డారు. వారంతా ప్రస్తుత ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. అధికారం చేపట్టి 8నెలలు గడిచాయి. గిరిజన గ్రామాలకు కూడా ప్రభుత్వం రోడ్లు వేయిస్తోంది. ఈ నేపథ్యంలో సగంలో ఆగిపోయిన సోంపురం-అనందపురం రోడ్డును కూడా పూర్తి చేస్తారని భావిస్తున్నారు.

లీకేజీలను అరికట్టాలి


రోడ్డుపై తవ్వకాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలో తాగునీటి పైపులైన్లకు ఎక్కడైనా లీకేజీలు ఏర్పడితే వెంటనే సరిచేయాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఆదేశించారు. పట్టణంలో లీకేజీలను అరికట్టేందుకు రోడ్లపై తవ్విన ప్రాంతాలను ఆమె శుక్రవారం పరిశీలించారు. వేసవి దృష్ట్యా వెంటనే ఈ పనులు పూర్తి చేసి సక్రమంగా తాగునీటిని అందివ్వాలని ఏఈని ఆదేశించారు. జంగాల శివాలయం, మార్కెట్‌లలో గల కమ్యూనిటీ లేట్రిన్‌ల నిర్వహణా తీరును పరిశీలించారు. రన్నింగ్ వాటర్ నిత్యం ఉండాలని, మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టాలన్నారు. కమిషనర్ వెంట ఏఈ గుప్త, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

బొబ్బిలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పట్టణ ఐసీడీఎస్ పీవో జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్‌వాడీలకు శిక్షణా కార్యక్ర మం నిర్వహించారు. నవచేతన ఆదర్శాలపై ఈ అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు సీహెచ్ అరుణకుమారి, బి.నిర్మల, కె.శుభల క్ష్మిలు అంగన్వాడీలకు శిక్షణ ఇచ్చారు.

రెల్లివీధిలో సదుపాయాలు కల్పించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జామి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమసింగి పరిధిలోని రెల్లిపేట రెండు దశాబ్దాలుగా కనీస సదుపాయల కు దూరంగా ఉందని సీపీఎం జిల్లా నాయ కుడు తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం రెల్లిపేట వాసులతో కలిసి తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కృష్ణలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకు లు మద్దిల రమణ, గాడి అప్పారావు, సంతోష్, రామరావు, అప్పన్న, రాము తదితరులున్నారు.

వీఆర్ఏల ఆందోళన

రామభద్రపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు బలసా శ్రీనివాసరావు కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వీఆర్ఏలు చాలీ చాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని, వేతనాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ కార్యాలయాలలో ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్, వీఆర్వో పోస్టుల్లో అర్హులైన వీఆర్ఏలను నియమించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వీఆర్ఏలకు చెబుతున్న నైట్ వాచ్‌మెన్, ఇసుక డ్యూటీలను రద్దు చేయాలన్నారు. అర్హులైన వీఆర్ఏలకు ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పలువురు వీఆర్ఏలు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి


ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

డెంకాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. డెంకాడలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 12 నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు అందడం లేదన్నారు. వారిని నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు.

ఆయుధ డిపో వద్దు



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

బాడంగి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): బాడంగికి దగ్గర్లో ఆయుధ డిపో ప్రతిపాదనలు ఆపాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.శంకరరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాల యం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో పలువురు రైతులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ ఈ ప్రాంతంలో ఆయుధ డిపో ఏర్పాటు చేయాలన్న కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వ్యతిరేకి స్తున్నామని అన్నారు. సంవత్సరానికి మూడు పంట లు పండే సారవంతమైన భూములను ఈ ఆయుధ డిపోకు ఇవ్వవలసిన అవసరం తమకు లేదన్నారు. అనంతరం డీటీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎ.సురేష్, పాల్తే రు ఎంపీటీసీ సభ్యుడు రమేష్, సర్పంచ్ ప్రతినిధి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలి

పాచిపెంట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి పల్లెలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి, పరిశుభ్రంగా ఉంచాలని డివిజనల్ పంచాయతీ అధికారి నాగభూషణం అన్నారు. శుక్రవారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌పై శిక్షణా కార్యక్ర మం నిర్వహించారు. సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీకి తరలించాలన్నారు. తద్వారా పంచాయతీకి ఆదాయం చేకూరుతుందని అన్నారు.

పౌష్టిక ఆహారాన్ని అందించాలి

బొబ్బిలి రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ చిన్నారులకు పౌష్టిక ఆహారాన్ని, నాణ్య మైన విద్యను అందించాలని ఐసీడీఎస్ సీడీపీవో జె.విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం కోమటిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె.. తల్లులు, బాలింతలు తీసుకో వల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ సీహెచ్ అరుణకుమారి తదితురులు పాల్గొన్నారు.



పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● డీఈవో తిరుపతినాయుడు

సీతంపేట రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో తిరుపతినాయుడు ఆదేశించారు. శుక్రవారం సీతంపేట ఏజెన్సీలోని దోనుబాయి, మల్లి ఆశ్రమ పాఠశాల, హడ్డుబంగి పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు. పరీక్షల తీరును పరిశీలించి, నిర్వాహకులకు సూచనలు చేశారు. మాస్ కాపీయింగ్‌కు ఎటువంటి అవకాశం ఇవ్వరాదని ఆదేశించారు. ఈ పరిశీలనలో ఎంఇవో ఆనందరావు ఉన్నారు.

వీరఘట్టంలో డీఎస్పీ పరిశీలన


పరీక్ష కేంద్రం ఆవరణలో పరిశీలిస్తున్న డీఎస్పీ రాంబాబు

వీరఘట్టం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను డీఎస్పీ రాంబాబు శుక్రవారం పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ పరిశీలనలో ఎస్ఐ జి.కళానిధి, సిబ్బంది పాల్గొన్నారు.





రబీకి కష్టకాలం

(ఐదో పేజీ తరువాయి)

సాధారణ విస్తీర్ణం 65,809 హెక్టార్లు. కానీ ఈ ఏడాది 45,137 హెక్టార్లు సాగు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ఇంత సాగు అన్నది అనుమానమే. అధికారులు మాత్రం ఫర్వాలేదని చెబుతున్నారు. జిల్లాలో వరి తరువాత ఎక్కువగా సాగుచేసే పంటల జాబితాలో మొక్కజొన్న, చెరకు, నువ్వు, వేరుశెనగ ఉన్నాయి. రబీ పంటలకు మద్దతు ధర, గిట్టుబాటు ధర కల్పించడం లేదు. దీంతో దళారులు, వ్యాపారులు రైతుల శ్రమను దోచుకుంటున్నారు. ఈ కారణాలన్నీ రబీలో సాగు తగ్గుముఖం పట్టడానికి కారణాలుగా తెలుస్తోంది.

వాస్తవమే..

జిల్లాలో రబీలో సాగు విస్తీర్ణం తగ్గిన మాట వాస్తవమే. కానీ గత ఏడాదితో పోలిస్తే మాత్రం పెరిగింది. ప్రధానంగా సాగునీటి కొరత కారణంగానే రైతులు రబీలో పంటల సాగును తగ్గిస్తున్నారు. అందుకే ప్రభుత్వం సాగునీటి వనరులపై దృష్టిపెట్టింది. వ్యవసాయ శాఖపరంగా సలహాలు, సూచనలు అందిస్తున్నాం.

- వీటి రామారావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, విజయనగరం

న్యూస్ బాక్స్

కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న డీఎస్పీ


డీఎస్పీ కుటుంబానికి అమ్మవారి చిత్ర పటాన్ని అందజేస్తున్న అర్చకులు

చీపురుపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారిని డీఎస్పీ ఎస్.రాఘవులు కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు వారికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

రామభద్రపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు.. వైద్యాధికారి దిలీప్‌కుమార్‌కు సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన వైద్యాధికారితో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ మద్దతు

బొబ్బిలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24, 25 తేదీల్లో దేశవ్యాప్తంగా జరగనున్న బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు మద్దతు పలుకుతున్నట్టు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు తెలిపారు. స్థానిక బ్యాంకు ఉద్యోగ సంఘ నాయకులతో కలిసి ఆయన శుక్రవారం కరపత్రాలను విడుదల చేశారు.

